## శృంగారతరంగిణి




రక్కే-ఇ పుత్త అంమత్త ఏణ ఓచ్ఛే అలం పడిచ్ఛన్తీ!
అంసుహి పహి అఘరిణీ ఓల్లిజ్జన్తం ణ లక్కే-ఇ!!

(గాథా సప్తశతి)

పొద్దంతా ఒకటే ఈదర గాలి. ఈ గాలికి పూరి గుడిసె ఎక్కడ లేచిపోతుందోనని భయం. దానికితోడు ఇప్పుడు బ్రహ్మాండమైన కుండపోత వర్షం. ఊరికెళ్ళిన భర్త ఇంకా రాలేదు. ఎదురుచూచి ఎదురుచూచి కన్నులు కాయలు గాచినవి. రేపే వస్తాడో! మాపే వస్తాడో! ఈ రాత్రి గడిచేదెట్లు? మనస్సులో అచంచలమైన విశ్వాసానికి ప్రతీక అన్నట్లుగా ఆ వైపు ప్రశాంతంగా వెలిగే దీపం. చేతిలో చంటిబిడ్డ.

ఎంత తప్పనిసరియైన పని వుంటేనో గానీ, భర్త పొరుగూరిలో ఆగిపోడు. తాను కాపురానికి వచ్చింది మొదలు ఏనాడూ, ఏ రాత్రీ తన భర్త తనను ఒంటరిగా విడిచి వెళ్ళలేదు. అలా ఎప్పుడూ వెళ్ళడు కూడా. అతనికి తానంటే- అంత ప్రేమ. ఆ అనురాగం అంత చక్కనిది- చిక్కనిది.

### అనురాగం

ఆమె ఆలోచనలోమునిగిపోయింది. ఇంతలో తలపై చల్లని స్పర్శ. చినుకులు, నీటిబొట్లు. గుడిసె చూరునుండి జారిపడుతున్నాయి.

మట్టూ నడుము లెత్తుటి గోడలు ఎప్పుడో తడిసి నీరుగారిపోతున్నాయి. క్రింద నున్న మట్టి నేల చల్లగామారిపోయింది. ఆ ఇల్లంతా చిత్తడి- తడి- పర్యాయ పదాలై పోయాయి.

పై నుంచి చినుకుల జోరు పెరిగింది.

బయట వానా,గాలీ రెండూ తోడయ్యాయి. పూరిపై అక్కడక్కడా కప్పిన తాటియాకులు చినుకుల చిటపట శబ్దాలకు వంతపాడు తున్నాయి.

చేతిలో వున్న చంటిబిడ్డ ఆ జంట గాథను రాగానికి ప్రతీక. చంటిబిడ్డపై చినుకులు పడతాయేమోనని ఆమె-తలవంచి తాను వంగి బిడ్డపై అడ్డంగా వాలింది.

పాపం! అమాయకురాలు!

చినుకులు తడపటం మాట ఏమోగానీ- ఆగక ధోరున తన కళ్ళనుండి జారే కన్నీళ్ళే తన బిడ్డను తడుపుతున్న సంగతి ఈ దుఃఖ భారంలో ఆమె గుర్తించినట్లు లేదు.

దారిద్ర్య భారం ఇన్ని రకాల-ఇన్ని విధాల తడిపేస్తున్నా మనస్సులో వెలుగుతున్న అనురాగ దీపం ఆరలేదు. విశ్వాసచ్ఛాయలు వీడలేదు.

ఆమె భర్తపై ఆమెకు అమిత విశ్వాసం.

ఆమెపై అతనికి అంత అనురాగం.

వలచి విశ్వాసం చూపించే ప్రియురాలు వున్నప్పుడు పరమ దారిద్ర్యంలో కూడా ఐశ్వర్యం వుంటుంది. వలపు, విశ్వాసం లేని దంపతుల మధ్య అష్టైశ్వర్యాలున్నా అక్కడ దరిద్రమే తాండవిస్తుంది.

-మాదుగుల నాగఫణి శర్మ

## కాలమ్ దాటని కథ

### అర్ధరాత్రి...ఆడపడుచు

అర్ధరాత్రి...సరిగ్గా పన్నెండు గంటలు దాటి అపుడే అయిదు...పది నిముషాలు అవుతున్నది. అమీర్ పేట చౌరాస్తాలో... అక్కడక్కడ మున్సిపల్ కార్పొరేషన్ వారి వీధి దీపాలు మినుకు...మినుకుమంటున్నాయి.

అపుడే కోఠీ నుంచి సనత్ నగర్ వైపు వెళ్ళే సెట్విన్ మినీ (డొక్కు) బస్సు వచ్చి అమీర్ పేట బస్టాపులో ఆగింది. బస్సులో పదిహేను మంది వరకు ప్రయాణీకులున్నారు. అందరూ మగాళ్ళే...

ఇంతలో...తెల్లని చీరె, జాకెట్టు, జడ నిండుగా మల్లెపూలు, మెడ నిండుగా నగలూ, నుదుట ఎర్రని బొట్టూ... కాళ్ళ గజ్జెలతో...పదహారణాల ఆడపడుచు... ఆంధ్రుల ఆడపడుచు...గున, గున నడచుకుంటూ... ఆగి వున్న బస్సు ఎక్కింది. అంతే... ప్రయాణీకులంతా ఒక్కసారిగా ఆశ్చర్యంలో మునిగిపోయారు. అర్ధరాత్రి...ఒక ఆడపడుచు...ఒంటరిగా నడిరోడ్డు మీద నడిచి వచ్చేసింది. అంటే...పూజ్య బాపూజీ కలలు గన్న రామరాజ్యం వచ్చేసిందన్నమాట. అందులోనుమన రాజధాని నగరంలో... అనుకుని కళ్ళు నులుముకుని చూసుకున్నారు ప్రయాణీకులంతా మరొక్కసారి.

బస్సు కదిలింది... ఎర్రగడ్డ స్టాపు వచ్చింది. బస్సు ఆగింది. బస్సులో నుంచి ఒక్కసారిగా దూకినట్లు దిగిందా ఆడపడుచు... అంతే... ఎక్కడినుంచి వచ్చారో...లాఠీలు ఊపుకుంటూ... నిద్రమత్తులో జోగుతున్నట్టున్న కళ్ళతో... ఇద్దరు ఎర్రటోపీ పోలీసు మామలు... ఏయ్! ఆగు! అంటూ గద్దించి ఆపారు ఆమెని.

రిపేరు రావడంతో అక్కడే నిలబడి వున్న బస్సులోని ప్రయాణీకుల గుండెల్లో ఒక్కసారిగా భయం నిండుకుంది. అంతకు ముందు రాత్రే షంషేర్ గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసు కానిస్టేబుల్ ఘాతుకానికి బలైపోయిన 18 సంవత్సరాల యువతి... అన్న వార్త... వాళ్ళ మనసులో మెదిలింది. పాపం! ఈ ఆడపడుచు గతేం అవుతుందో! ప్రయాణీకులు అనుకున్నారు జాలిగా మనసులో.

అయ్యో! పొద్దుట నుంచీ ఊరంతా వెతికాం. మహాతల్లి ఇదుగో ఇక్కడ తగలడింది అన్న మాటలు వినవచ్చిన వైపు దృష్టి సారించారు ప్రయాణీకులు. వాళ్ళిద్దరూ ఎర్రగడ్డలోని పిచ్చాసుపత్రి కాపలా సిబ్బంది. ఈ ఆడపడుచుకు పీటల మీద పెళ్ళి తప్పిపోవడంతో పిచ్చెక్కింది. ఆసుపత్రి నుంచి దగ్గరున్న గిల్టు నగలు వేసుకుని ఉదయాన్నే కాపలావారి కన్నుగప్పి పారిపోయింది. పోలీసు కానిస్టేబుళ్ళతో చెబుతున్న మాటలు... చెవినపడ్డ ప్రయాణీకులు మరొక్కసారి... అయ్యో! పాపం! అనుకున్నారు...

—అదపాక సత్యారావు